రహదారులు ఘోరం..!

- రాళ్లు తేలి గోతులతో నిండిన శివాజీపాలెం – పిఠాపురం కాలనీ రోడ్లు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు



గోతులతో నిండిన శివాజీపాలెం రహదారి



బీచ్ రోడ్డు: ఆ రోడ్ల మీద ప్రయాణం చాలంటేనే వాహన చోదకులకు భయం భయంగా ఉంటుంది.. వాహనం నడిపేటప్పుడు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న జారి పడటం ఖాయం.. అంత ఘోరంగా ఉన్నాయి శివాజీపాలెం – పిఠాపురం కాలనీ రహదారులు. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి, రాళ్లు తేలి ఉన్నా.. మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ఆ రోడ్లపై వాహనాలు నడిపేందుకు చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గోతులమయం..

జీవీఎంసీ 20, 22 వార్డుల్లో విస్తరించి ఉన్న శివాజీ పాలెం రోడ్డు పెద్ద పెద్ద గోతులతో నిండి ఉంది. పైగా ఇదే మార్గంలో రాష్ట్ర హోం మంత్రి అనితతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు కూడా రాకపోకలు సాగిస్తుంటారు.. అటువంటి ప్రధానమైన రహదారి గోతులమయమై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ప్రముఖులు రాకపోకలు సాగించే రోడ్డు పరిస్థితి ఇలా ఉంటే.. వార్డులోని మిగిలిన రోడ్లు సంగతేంటో ఇట్టే అర్థమవుతుంది.

భారీ వాహనాల రాకపోకలు..

ఇటీవల శివాజీపాలెం, పిఠాపురం కాలనీ పరిధిలో బహుళ అంతస్తుల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. దీంతో వాటి సామగ్రి నిమిత్తం భారీ వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల రోడ్లు పాడవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణ సామగ్రిని కూడా రోడ్ల మీదే పడేస్తున్నారని, తద్వారా రోడ్లు పూర్తిగా పాడైపోయి రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోందని చెబుతున్నారు.

అడుగడుగునా అధ్వానం..

పిఠాపురం కాలనీ నుంచి శివాజీపాలేనికి వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ మార్గం వెడల్పు తక్కువగా ఉండటం, రోడ్లపై రాళ్లు తేలడంతో చోదకులకు వాహనం నడపడం కత్తి మీద సాముగా మారింది. ఈ మార్గంలో ఉండే బ్రిడ్జి కూడా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ మార్గం మీదుగా అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

మరమ్మతులకు ఎదురుచూపులు..

తాము అధికారంలోకి వస్తే రోడ్లన్నింటికీ మరమ్మతులు చేపడతామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. రహదారులకు మోక్షం కలుగుతుందని ఆశించిన స్థానిక ప్రజలకు ప్రభుత్వం మొండిచేయి చూపించింది. ఇప్పటివరకు పాడైన రోడ్లు మరమ్మతుల కోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో తమ కాలనీల రోడ్లు ఎప్పటికీ బాగుపడతాయోనని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.





అధ్వానంగా పిఠాపురం - శివాజీపాలెం రోడ్డు

క్లుప్తంగా

'భావ విపంచి'కి కొనిరెడ్డి ఫౌండేషన్ పురస్కారం



ఉండవిల్లి వెంకట నారాయణమూర్తి

ఏయూక్యాంపస్: నగరానికి చెందిన ఉండవల్లి వెంకట నారాయణమూర్తికి కొనిరెడ్డి ఫౌండేషన్ జాతీయ పురస్కారాన్ని ప్రకటించింది. వృత్తిరీత్యా ఇంజినీర్ అయిన వెంకట నారాయణ మూర్తి సాహిత్య అభిలాషతో రచించిన కవితా సంపుటి భావ విపంచి ఇటీవల కతార్‌లో ఆవిష్కరించారు. ఈ సంపుటికి కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళావేదిక సంయుక్తంగా ఈ పురస్కారాన్ని ప్రకటించాయి. త్వరలో ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా నారాయణమూర్తిని ఉత్తరాంధ్ర కళ, సాహిత్య సంస్థలు, కవులు, కళాకారులు పలువురు అభినందించారు.

'గణపతి వైభవం'పై ఆకట్టుకుంటున్న ప్రవచనాలు



ప్రవచిస్తున్న షణ్ముఖశర్మ

ఎంవీపీకాలనీ: శ్రీ మహాగణపతి వైభవంపై బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకుంటున్నాయి. రుషి పీఠం సత్సంగం శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్‌-6లోని భద్రం పార్క్ వేదికగా ప్రవచన కార్యక్రమం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆదివారం షణ్ముఖశర్మ వేద, పురాణ, మంత్ర శాస్త్రాల సహిత శ్రీ మహాగణపతి వైభవాన్ని తన ప్రవచనాల ద్వారా విశదీకరించారు. కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, నిర్వాహకులు కేవీఎస్ శ్యామ్, కందాళ అరుణ గాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మెట్ల మార్గం



నోవాటెల్ ఎదురుగా విరిగిన ఇనుప మెట్లు

ఏయూక్యాంపస్: నోవాటెల్ హోటల్ ఎదురుగా ఆర్కే బీచ్ రోడ్డు నుంచి ప్రధాన రహదారిపైకి రావడానికి గతంలో ఇనుప మెట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇవి తుప్పుపట్టి విరిగిపోతున్నాయి. ఇప్పటికే ఒకవైపు మెట్ల హ్యాండిల్ దెబ్బతిన్నాయి. మెట్లు ఒక పక్కకు వాలిపోయి ప్రమాదకరంగా మారాయి. రాత్రి వేళల్లో పర్యాటకులు వీటిని వినియోగిస్తే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాల్సిన స్థానికులు కోరుతున్నారు.

జూ నుంచి కంబాలకొండకు రహదారి నిర్మాణం



కంబాలకొండ పార్కు, నర్సరీ మధ్యలో నిర్మించిన మట్టి రోడ్డు

ఆరిలోవ: జాతీయ రహదారిపై కంబాలకొండ ఎకో టూరిజం పార్కు లోపల కొద్ది రోజులుగా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఇక్కడ 200 మీటర్ల పొడవున మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. కంబాలకొండ లోపల ప్రధాన ద్వారం సమీపం నుంచి జూ పార్కు ఎదురుగా ఉన్న అటవీ శాఖ నర్సరీకి మట్టి రోడ్డు నిర్మించారు. దీని మధ్యలో ఉన్న గెడ్డ అడుగు భాగంలో నీటి కుండీలు అమర్చి వాటిపై రాళ్లు పేర్చి మట్టితోనే కల్వర్టు కట్టారు. దీనివల్ల జూ పార్కు నుంచి సందర్శకులు నేరుగా కంబాలకొండ పార్కుకు రాకపోకలు సులువవుతుంది. ప్రస్తుతం సందర్శకులు జూ పార్కు నుంచి కంబాలకొండ వెళ్లడానికి జాతీయ రహదారిపై విశాఖ వ్యాలీ స్కూల్ కూడలి వరకు సుమారు అర కిలోమీటర్‌కు పైగా వెళ్లి అక్కడ యూ టర్న్ తీసుకొని తిరిగి రావాల్సి వస్తుంది. ఇప్పుడు ఇక్కడ కల్వర్టు, మట్టి రోడ్డు నిర్మించడంతో ఆ సమస్య తీరనుంది. జూ పార్కు గేటు నుంచి ఎదురుగా ఉన్న నర్సరీ గేటు లోకి ప్రవేశించి కంబాలకొండ పార్కుకు సులువుగా చేరుకోవచ్చని కంబాలకొండ అధికారులు తెలిపారు.

కైలాసగిరిపై రోడ్లు శిథిలం



కైలాసగిరిపై పార్కుకు వెళ్లే శిథిలమైన రహదారులు



ఆరిలోవ: నగరంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కై లాసగిరిపై పలుచోట్ల రహదార్లు శిథిలమయ్యాయి. కొండపై శివపార్వతుల విగ్రహాల పక్కన విశాలమైన పార్కు ఉంది. ఈ పార్కులో పెద్దలు సేద దీరడంతోపాటు పిల్లలు ఉత్సాహంగా ఆటలాడుకుంటున్నారు. ఇక్కడ పిల్లల కోసం పలు ఆటపరికరాలు కూడా ఉన్నాయి. ఈ పార్కు చుట్టూ ఉన్న రహదారులు మాత్రం శిథిలమయ్యాయి. వీటిపై నడవడానికి సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై అమర్చిన పలకలు పలుచోట్ల ఊడిపోయి అస్తవ్యస్తంగా మారాయి. విదేశీ పర్యాటకులు సైతం తరుచూ సందర్శించే ఈ పార్కులో రహదారులు అధ్వానంగా ఉండటంతో సందర్శకుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి కై లాసగిరిపై శిథిలమైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మెరుగైన సమాజ నిర్మాణంలో సహకార సంస్థలు కీలకం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ లక్ష్మీదాస్

బీచ్‌రోడ్డు: మెరుగైన సమాజ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర కీలకమని నేషనల్ ఫెడరేషన్ ఫర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్(నాఫ్‌కబ్) చైర్మన్ లక్ష్మీదాస్ పేర్కొన్నారు. ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్(వీసీబీ) 110వ ఏడాదిలోకి అడుగిడుతున్న తరుణాన్ని పురస్కరించుకొని ఆదివారం సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025ను సహకార సంవత్సరంగా ఐక్య రాజ్య సమితి ప్రకటించిన నేపథ్యంలో కో ఆపరేటివ్ సంస్థలు సహకార స్ఫూర్తి చాటేలా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనకాపల్లి, ఉత్తర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పి.విష్ణుకుమార్‌రాజు ప్రసంగిస్తూ కో ఆపరేటివ్ బ్యాంకు సేవలను అభినందించారు. వీసీబీ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ 1916లో బ్యాంకు స్థాపించిన నాటి నుంచి దినదినాభివృద్ధి చెందుతూ నేటికీ 1.10 లక్షల మంది సభ్యులు, 55 బ్రాంచీలు, రూ.7,700 కోట్ల వ్యాపారంతో పురోభివృద్ధి సాధించినట్లు వివరించారు. ఈ ఏడాది మార్చి నెలాఖరికి రూ.8 వేల కోట్ల టర్నోవర్ సాధించేలా వీసీబీ పాలకవర్గం, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యేలు, వీసీబీ పూర్వ చైర్మన్ మానం ఆంజనేయులు, రాష్ట్ర కో ఆపరేటివ్ ఫెడరేషన్ అధ్యక్షుడు చిట్టూరి రవీంద్ర, ఉపాధ్యక్షుడు షేక్ జిలానీ, సిటిజన్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు ఎం.ఎ స్.ఆర్.వి.ప్రసాద్, ఫెడరేషన్ డైరెక్టర్ ఎం.వెంకటరత్నం, బ్యాంకు డైరెక్టర్లు జె.వి.సత్యనారాయణమూర్తి, ఎ.జె.స్టాలిన్, పి.వి.నరసింహమూర్తి, సీఈవో వరలక్ష్మి, ఇతర డైరెక్టర్లు, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహా కుంభమేళా యాత్రికులకు ఏర్పాట్లు

తాటిచెట్లపాలెం : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లే ప్రయాణికుల కోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ విస్తృత ఏర్పాట్లు చేసినట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. వాల్తేర్ డివిజినల్ రైల్వే మేనేజర్ మనోజ్‌కుమార్ సాహూ నేతృత్వంలో ప్రయాణికుల కోసం పలు రైళ్లు నడుపుతున్నామన్నారు. కమర్షియల్ సిబ్బంది, రైల్వే భద్రతా దళం సిబ్బంది ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తూ, ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రత్యేక రైళ్లు, మహా కుంభమేళా ఏర్పాట్లు తెలియజేసే కరపత్రికలను ప్రయాణికులకు అందించారు.

'తెలుగు సాహిత్యానికి జీవితాన్ని అర్పించారు'



శారద కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ తదితరులు

సీతంపేట: తమిళనాట పుట్టి, తెలుగు సాహిత్యానికి జీవితాన్ని అర్పించిన మహోన్నత వ్యక్తి సాహిత్య చిరంజీవి శారద సుబ్రహ్మణ్య అయ్యర్ నటరాజన్ అని పలువురు వక్తలు కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఘండికోట రఘురామారావు అధ్యక్షతన ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం సుబ్రహ్మణ్య నటరాజన్ అయ్యర్ శత జయంతి సభ ఘనంగా నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ తమిళనాడులోని పుదుక్కోటలో జన్మించిన శారద సుబ్రహ్మణ్య నటరాజన్ 12 ఏళ్ల వయస్సులో వృద్ధుడైన తన తండ్రితో బతుకుతెరువు కోసం1937లో ఆంధ్రాలోని తెనాలికి వచ్చారని తెలిపారు. తెలుగు భాషపై పట్టు సాధించి వందకుపైగా కథలు రాశారని తెలిపారు. ఒకవైపు మూర్ఛవ్యాధి, మరోవైపు ఆకలి బాధలో సైతం తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. 31 సంవత్సరాల వయస్సులోనే శారద చనిపోవడం దురదృష్టకరమని, విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో శారద శత జయంతి సభ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం కె.శరత్ చంద్ర సంపాదకత్వంలో ప్రచురించిన శారద కథలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, శరత్‌చంద్ర, జె.పి.శర్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేద్దాం



వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నడింపల్లి కృష్ణంరాజును సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

మద్దిలపాలెం: పేదల హృదయాల్లో సుస్థిరంగా నిలిచిన వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దామని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకుడు నడింపల్లి కృష్ణంరాజు పిలుపునిచ్చారు. ఇటీవల పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకమైన ఆయనను ఆదివారం మద్దిలపాలెంలోని తన నివాసం వద్ద తూర్పు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ పార్టీకి కట్టుబడి పనిచేస్తున్న తన సేవలను గుర్తించి జిల్లాలో కీలకమైన ఉపాధ్యక్ష పదవి అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. పార్టీ నియమ, నిబంధనలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కృష్ణంరాజుకు పార్టీ 15వ వార్డు సీనియర్ నాయకులు, మహిళా నాయకులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ కణితి మరియదాస్, మహిళా సీనియర్ నాయకులు అనకాపల్లి రవణమ్మ, పెద్దిరెడ్ల నూకరాజు, మారడపూడి వేలాంగణి, భాస్కర్, వెంకటరావు, అర్జి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో సైబీరియన్ హస్కీల హంగామా



సైబీరియన్ హస్కీ శునకాలు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో ఆదివారం సైబీరియన్ హస్కీ జాతి శునకాలు సందడి చేశాయి. నలుపు, గోధుమ వర్ణం కలిగిన రెండు శునకాలను వాటి యజమానులు ఆదివారం ఉదయం బీచ్‌కి తీసుకువచ్చారు. ఇవి ఎంతో అందంగా, ఆరోగ్యంగా, స్నేహపూర్వకంగా ఉండటంతో నగరవాసులు ఫొటోలు తీసుకున్నారు. కొంతమంది వీటితో సరదాగా గడిపారు.

సామాజిక భవనం ప్రారంభం



నూతన భవనంలో కార్పొరేటర్ ముప్పల లక్ష్మి, సురేష్ తదితరులు

బీచ్‌రోడ్డు: విశాఖ మాజీ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ ఎంపీ నిధులతో జీవీఎంసీ 20వ వార్డు కాగితల వీధిలో నిర్మించిన సామాజిక భవనాన్ని ఆదివారం కార్పొరేటర్ ముప్పల లక్ష్మి గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఎంపీ నిధులు రూ.30 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి శివరాత్రి ఉత్సవాలు



శివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 26 వరకు మహా శివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికలు ముద్రించి ఆవిష్కరించారు. వీటిని పెదగదిలి, సాలిపేట, చినగదిలి, ఆరిలోవ ప్రాంతాల్లో ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోల బంగారయ్య మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని శుభ్రం చేయిస్తున్నామని, పూజలు, అభిషేకాలు జరగనున్నాయని తెలిపారు. ఉత్సవ మూర్తుల ఊరేగింపు, తిరువీధి పల్లకీ సేవ, గరిడీలు, తప్పెటగుళ్లు, 1001 బిందెల నీళ్లతో స్వామికి అభిషేకం, ఈ నెల 23న శివపార్వతుల కల్యాణం, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో మహా అన్న సమారాధన, 26న శివరాత్రి సందర్భంగా వేకువజాము 4 గంటల నుంచి పూజలు, అభిషేకాలు జరపనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చల్లా రాజు, దూలి రఘు, పాత్రేరు శ్యామ్, బొట్టా రమణ, ఆలయ అర్చకుడు లక్ష్మణశాస్త్రి పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న హెలికాప్టర్ మ్యూజియం



హెలికాప్టర్ మ్యూజియం ప్రవేశ ద్వారం



సుందరీకరణలో భాగంగా నాటిన మొక్కలు



వేర్లు బయటకు వచ్చిన మొక్క

ఏయూక్యాంపస్: పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని అందించేందుకు బీచ్ రోడ్డులో యూహెచ్3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం సిద్ధమవుతోంది. తుది మెరుగులు దిద్దుకుంటూ కొద్ది రోజుల్లో ప్రారంభానికి ముస్తాబవుతోంది. ప్రస్తుతం ఈ ప్రాంగణం చుట్టూ పచ్చదనం, మొక్కలు పెంచే పనులు జరుగుతున్నాయి. లాన్‌లో వేయడానికి ప్రత్యేక గ్రీన్ లాన్ తీసుకువచ్చారు. యుద్ధ విమానం మ్యూజియం బయట లాన్‌లో అవసరమైన ప్రాంతంలో వీటిని పరచే పనులు నిర్వహిస్తున్నారు. అదే ప్రాంగణంలో పచ్చదనం పెంచే చర్యల్లో నిర్లక్ష్యం తాండవిస్తోంది. కొన్ని మొక్కల వేర్లు బయటకు కనిపిస్తున్నాయి. మొక్కలు నాటడంతో లోపాలను సరిచేయాల్సిన అవసరం ఉంది.

సాగర తీరం.. ఆనంద కోలాహలం



సాగర తీరంలో సాయంత్రం వేళ సంధ్యా సూర్యుడిని చూస్తూ ఆనందంతో నగరవాసులు మునిగిపోయారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో బీచ్‌లో ఆటపాటలతో సందడిగా గడిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సముద్ర స్నానాలు చేశారు. చిన్నపిల్లలు ఆటల్లో మునిగిపోయారు. గుర్రంపై సవారీ చేస్తూ ఫొటోలు తీసుకున్నారు. ఆదివారం సాగర తీరంలో కుటుంబ సభ్యులతో కలిసి నగరవాసులు ఆనందంగా గడిపారు.

– ఏయూక్యాంపస్

శివాజీ పార్క్ రోడ్డులో బడ్డీలపై చర్యలేవి..?

- ఫిర్యాదులు పట్టించుకోని టౌన్ ప్లానింగ్ విభాగం



శివాజీ పార్క్ వద్ద రోడ్డుపై అనధికారిక బడ్డీలు

ఎంవీపీకాలనీ: శివాజీ పార్క్ రోడ్డులో వెలసిన అనధికారిక బడ్డీలపై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నా.. జీవీఎంసీ జోన్‌-3 టౌన్ ప్లానింగ్ విభాగం తాత్సారం చేస్తోంది. కొంతకాలంగా ఈ బడ్డీలను తొలగించాలని స్థానికులు ఫిర్యాదులు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఇక్కడి అనధికారిక బడ్డీలపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు జీవీఎంసీ కమిషనర్‌కు అందించినట్లు పలువురు ఫిర్యాదుదారులు తెలిపారు. పార్క్ ఎదుట అసాంఘిక కార్యకలాపాలకు వేదిక అవుతుండటంతోపాటు రాత్రి పూట ట్రాఫిక్ ఇబ్బందులు, వాహన ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ బడ్డీలను తొలగించాలని వారు కోరుతున్నారు. బడ్డీల తొలగింపు, ఫిర్యాదులపై జోన్‌-3 ఏసీపీ మధుసూదన్‌రావు, టీపీఎస్ నారాయణ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఒక బడ్డీ తొలగింపులో ఉత్సాహం ప్రదర్శించిన టీపీఎస్ నారాయణ మిగతా బడ్డీల తొలగింపుపై ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదు సమయంలో కమిషనర్ చర్యలు తీసుకోవాలని నేరుగా సూచించినా వారు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముడసర్లోవ పార్కులో సందడే సందడి



ముడసర్లోవ పార్కులో స్నేహితుల సందడి

ఆరిలోవ: ముడసర్లోవ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. స్నేహితుల బృందాలు, పూర్వ విద్యార్థులు, యూనియన్ల సభ్యులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వనభోజనాలతో సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పార్కులో ఉత్సాహంగా గడిపారు. చిన్నాపెద్దా అంతా కలిసి ఆటపాటలు, డ్యాన్స్‌లతో కేరింతలు కొట్టారు. సందర్శకుల తాకిడితో ముడసర్లోవ పార్కులో కోలాహలం నెలకొంది.